



తలకట్టులేని 'క'లాగ మెలికలు తిరిగిన వాగు ఆ గ్రామాన్నొరుసుకు ప్రవహిస్తోంది. ఆవాగు పైనో పొడుగాటి వంతెన, వంతెన ప్రక్కనే పరుగులు తీసే తంతితీగెలు, తీగెలమీద వరుసగా వ్రాలిన రంగుల పిట్టలు, కలకతేరిన రంగు నీటిలో ఊయల లాగే వాటి నీడలు-చూస్తూ కూర్చున్నది శారద.

పొలంపని ముగించుకొన్నాడు. అన్నపుగిన్నె పాతచెప్పులు పలుగుచివర తగిలించాడు. తొడల పైకి బిగగట్టిన ముతక పంచె దులిపి, తలపాగలో దాచిన చుట్టపీకను పైకితీశాడు! పలుగు బుజానికెత్తుకొని చుట్టపీక నోటబెట్టాడు. ఇంటివైపు వడివడిగా నడుస్తున్నాడు రాముడు. కనుమసక వేళకు వాగుదరికొచ్చాడు కాని నిప్పు దొరకలేదు. వాగు ప్రక్కనున్న జామతోట కేసి చూశాడు. తపస్సు చేసే కొంగమాదిరి నిశ్చలంగా కనిపించింది ఏకంకొయ్య. దాని క్రిందుగా కాళ్లు కడిగే సుబ్బి కనిపించింది. దరి జేరాడు ధీమాగా.

'అగ్గిపెట్టుందా?' అడిగేడు.

సుబ్బి చేతులు కడుగుతోంది.

'కులకదే వశా!...అగ్గి కావాలి.' సుబ్బి ముఖంకూడా కడుక్కొని రెండు చారల చల్లని నీరు త్రాగి నిలవడింది. రాముడికేసి తాపీగా చూసింది.

'ఏం పొగకట్టిందంటేనా' దీర్ఘంతీశాడు.

మెలి విప్పి నడుంచుట్టూ బిగించిన పైట చెంగు లాగింది. విడదీసి రాముడి ముఖాన దులిపింది. ముఖం తుడుచుకుంటున్న సుబ్బి నడుంమీద ఓ చరుపు చరిచాడు.

'ఓరి నీ చెయ్యిరగ. నీకేం రోగ మొచ్చిందిరా! అసలే నొప్పెట్టి నే చస్తుంటే.'

'అంత లావు పనేం జేశావ్?'

'నీ యబ్బ ఎవడు తడిపాడు తోటంతా!'

'ఓస్! అదా. సరే నిప్పు మాడు.'

'నీకోస మీడ కూసుంటేంరా నిప్పు?'

'అసంట సూడు. ఆ దిమ్మమీగ, ఓరో ఉండారు.' సుబ్బి తోటలోకి పోయింది. రాముడు వంతెనకేసి నడిచాడు. మసక చీకట్లో ఓ చలువరాతి విగ్రహం కనిపించింది. సమీపించాడు. వంపులు తీరిన పాలరాతి ప్రతిమ కదిలింది. ఒక్క నిముషమాగేడు. కిట్టూర్చిందా అందాల ప్రోవు.

'శారదమ్మగారూ! ఈడ కూకుండారేం!' ఉలిక్కిపడ్డ శారద వెనక్కు తిరిగి.

“సుబ్బన్న”

'ఊరికినే రాముడూ!' అని జవాబిచ్చింది.

'ఊరికినే ఈడెందుకండీ? ఇంటికి పోదాం రాయండి' ఆప్యాయంగా ఆహ్వానించాడు చుట్ట పీకను నీళ్ళల్లోకి విసిరేస్తూ.

దండలం మీది కండలు పైకుబుక గ్రీకు యోధునిలాగ నడుస్తున్నాడు రాముడు. ఏవో ఆలోచిస్తూ తెల్లకిలంగా, కల్చరివాణీ. పేటంచు రవిక, మంచు బొమ్మలాగ కదిలిపోతోంది శారద వాడి వెనుక.

* * *

'ఎక్కడికెళ్ళేవే?' ఆదుర్దాగా అడిగింది తల్లి.

'వంతెన కాడుంటే పిల్చుకొచ్చేనండీ' పలుగు క్రిందికి దింపుతూ నివేదించాడు రాముడు.

'అక్కడికెందుకెళ్ళేవే?'

'చల్ల గాలికి.'

'చల్ల గాలా!' నోరు నొక్కుకుంది లక్ష్మమ్మ.

'వెళ్ళేదు పిల్లవు పెరడు దాటబోకే-అంటే వంటరిగా వంతెనదగ్గర కెళ్ళేవూ-అదేమంటే చల్ల గాలి కంటావా? అక్కడే కూర్చుందేం చల్ల గాలి? ఇక్కడ లేదూ? మేమంతా మనుషులం కాదూ? ఆc, పిల్ల ఈడేరింది ఇక బడి మానిపించండో అని మొత్తుకొంటే వింటేనా? వెధవ చదువులు చేస్తున్న ఇంతాను. మీ నాన్నగారు రానీ-ఆ చల్లగాలి సంగతేదో కనుక్కుంటాను' వెళవెళలాడించింది లక్ష్మమ్మ.

తాను చేసిన తప్పేమిటో, అర్థంకాక తికమకలు పడుతోంది శారద.

'అమ్మగారూ!' రాముడి పిలుపు.

'ఏమిట్రా?'

'పాల చెంబండీ.'

పాలచెంబు రాముడికిస్తూ 'ఇదిగో ఈపునవంగానే శాస్త్రిగా రరుగుమీద వారుంటారుగాని పిల్చుకురా' అని చెప్పింది లక్ష్మమ్మ.

ఆ సంవత్సరం వాగు గ్రామాన్నెంత కోసిందీ అంచనా వేసి, జొన్నపంట తగ్గడానికి కారణాలు చెప్పి, బస్తీల్లో ప్రజలు బియ్యానికి పడే అవస్థా సినిమాహాలుదగ్గర చేసే దొమ్మియుద్ధాలు వర్ణించి కొరియా యుద్ధంలో అమెరికా సైన్యాలపాట్లు మెకార్థరు సేనానాయకుని తెలివితేటలు తీర్గా పీకరువు పెడుతున్న అవధానిగారికి రాముడి పిలుపు పిస్తోల్ దెబ్బలాగ తగిలింది. విసుక్కుంటూ ఇల్లు చేరుకొన్నారు.

'ఇంతలోకే ఏం మునిగిపోయిందని! ఈ పిలుపు?'

'కొంప'. చురుగ్గా సమాధాన మిచ్చింది లక్ష్మమ్మ.

'నోరు ముయ్' గర్జించారు అవధానిగారు

'మూకారుగా-ఈ పాపిష్టి చదువులు మన కొద్దంటే విన్నారూ? అమ్మాయిగారెక్కడికి వేంచేశారో కనుక్కోండి!' తల్లి ఇంత గొడవ ఎందుకు పెడుతోందో శారదకు తెలియలేదు. అసలు సంగతేమిటో అవధానిగారి కర్థమవలేదు.

'ఏమిటి తల్లీ?' శారద నల్లని కురులు సవరిస్తూ అడిగారు.

తండ్రి కరస్పర్శ తుకతుకలాడే హృదయానికి చందన మద్దినట్టుంది.

'అదికాదు నాన్నా సాయంకాలం చల్లగాలి కని వంతెనదాకా వెళ్ళేను' శారద కళ్ళు నీరు చిమ్మనై.

'వంటరిగా వెళ్ళావా తల్లీ?' బుజ్జగించారు.

'తల్లీతల్లీ అంటూ నెత్తిమీద పెట్టుకోండి పదిహేనేళ్ళొచ్చినా పెండ్లీ పేరంటంలేకుండా. ముందుముందు తెలుస్తుంది తల్లిసంగతి ఈ పాపిష్టి చదువులొద్దో అంటే విన్నారా?' ధుమధుమలాడింది లక్ష్మమ్మ.

'ఏమిటే నీ వరస?'

'ఏమిటా? మునిమాపువేళ వంటరిగా వంతెనదగ్గర షికార్లు కొడుతోంది మీకూతురు. మీకేం? నలుగురు నా మొఖానేగా ఉమ్మేసేది. ఈడేరిన పిల్లకి చదువు లెందుకంట? వాటి ఫలితమేగా ఈ చల్లగాలీ, వంటరి షికార్లూను-చూసేవా రేమనుకుంటారన్నా ఉండక్కర్లా, వంకా, వరుగా? మా తమ్ముని కిమ్మంటే అదీ కాదన్నారు' చిన్న జల్లు ప్రారంభమయింది. లక్ష్మమ్మ కన్నీరు అవధానిగారిని కొంచెం కదిల్చివేసింది. శారదకు తల్లి తహతహ పూర్తిగా అర్థమైంది.

'అదేమిటి శారదా! వంటరిగా అక్కడికెందు కెళ్ళావు? అందులో సంధ్యవేళ ఇంట్లో లేకుండా. చల్లగాలి కావలిసొస్తే పెరట్లో మామిడిచెట్టు

దగ్గర మంచ మేసుకోగూడదూ!' కొంచెం హెచ్చుస్థాయిలోనే అడిగారు అవధానిగారు.

శారద ముడుచుకుపోయిన ముఖం వడిలి పోతుంది. అసలే చిన్నదోరేమో, ముకుళించే కళికి పారసీకపు సౌందర్యానికి వెన్నె దెచ్చింది. శారదకు నిజం చెప్పకతప్పింది కాదు. వణు కుతూ చెప్పింది.

'లెక్కల మేష్టారు... చూడమన్నారు...'

'వాగునా? ఇంకేమీ లేవు చూడ్డానికి?' అక్కసు వెళ్ళగ్రక్కింది లక్ష్మమ్మ

'నీకమ్మ దున్నాడని ఆయనకేం తెలుసు.' అవధానిగారు ధోరణి మార్చివేశారు. శారదకు కొంచెం 'రిలీఫ్' ఇచ్చింది కాని ఆధోరణే లక్ష్మమ్మకు కారంరాసింది. ముడుచుకొని కూర్చున్నది లక్ష్మమ్మ. శారద చెప్పుకుపోతోంది. 'లెక్కలంటే అంకెలు కావట. లెక్కలంటే ప్రకృతే నన్నారు. అన్వయం చేసుకొంటే గణితం ఈశ్వరానుభూతి నిస్తే కలిగిస్తుందట. వాగువంపుల్లో, నీరుతోడే ఏతపుకొయ్యల్లో, కొండవెనుకగా అస్తమించే సూర్యబింబంలో, విప్పారిన పూలవికాసంలో, ముత్యాల్లా గా రాలే వర్షపుచినుకుల్లో క్షేత్రగణితప్రతిభ ప్రతిబింబిస్తుందిట. వాగునడిచే నడకల్లో, తంతితీగెల ప్రకంపనాల్లో, పైకెగిరే పక్షుల రెక్కల రెపరెపలో బీజగణితం తొంగిచూస్తుందిట. అసలు గణితమంటేఘనీభవించిన సంగీతమంట. అందుకని సూర్యాస్తమయకాలంలో వాగుదగ్గరకెళ్ళాను.'

'ఆసీ నీచదువు చట్టుబండలుగానూ! మొన్న నేమో బీరకాయలను చెక్కుదీయకుండా వండమన్నావ్! నిన్నేమో కుడుముకు పప్పు రుబ్బకు రమ్మంటే- గొడ్లకేసీ పొట్టుతోసహా రుబ్బకొచ్చేవ్! ఈవేళేమో వాగులో లెక్కలు చదవడానికెళ్ళేవ్! ఎవడా లెఖ్ఖల మేష్టరు! అదేదో కాస్త కనుక్కోండి. ఈచదువులుం మన కొద్దంటే వింటారూ? వాగులో లెఖ్ఖలేమిటి? అవ్వ!' లక్ష్మమ్మ చేత్తో నోరు మూసుకొని, గుడ్లు పెద్దవిచేసి భర్తకేసి ఒక్క చూపు చూసింది.

అవధానిగారిది పక్వమైన హృదయం, ఉన్నతమైన పుటుక. శారద ఆ నాడాయన హృదయతంతువులను మీటింది. అనిర్వచనీయమైన మధురసంగీతం వినిపించింది. చిరునవ్వుతో శారదవైపు చల్లగా చూశారు. మండువేసవిలో మంచుముక్కలాగ పనిచేసిందా చూపు ఆనందంతో ముందుకు తూగింది శారద. దగ్గరకు తీసుకొన్నాడు తండ్రి. వారి వక్షంమీద వ్రాలిపోయింది, తండ్రి కౌగిటిలో కరిగిపోయింది. కనురెప్పలు క్రిందికి దిగిపోయినై. ప్రపంచమంతా ద్రవించి వంపులు తిరిగి వాగులాగ ప్రవహించింది. ఆ వంపుల్లో స్వచ్ఛజ్యోత్స్నపుల కలుతీరులు తీరినై. ఆ తీరుల్లో క్రమాన్ననుసరించి, కట్టుబాటుకు లొంగి ఏదో ఒక నగ్న సత్యం నృత్యం చేస్తోంది. వంతెన పక్కన వరుసలుతీరిన తంతులు ప్రకంపించి మధురాతిమధురమైన సంగీతాన్ని వెదజల్లుతున్నై. విస్తృత పక్షాలను రెపరెపలాడిస్తూ పతంగకన్యలా వాగు మీదుగా బారులుతీర్చాయి. వారి రెక్కల చలనాలు తరగలై తంతితీగెలమీదుగా క్రిందికిదిగినై.

అవధానిగారు ఏదో లోకంలో 'అమ్మా!' అన్నారు. శారద ప్రఫుల్ల ముఖం కొంచెంగా పైకెత్తింది. ఎఱ్ఱని పెదవులు చలించినై. 'రెండు రాసుల యోగంయొక్క వర్గం నాన్నా!'


'ఏమిటి తల్లీ?'

'రూపొందిన బిందు చదరం'

లక్ష్మమ్మ తండ్రీకూతుళ్ళిద్దరికీ పిచ్చిపట్టిందను కొన్నది, తనకు పూర్తిగా ఆశాభంగం కలిగినందున మెల్లిగా అక్కడనుండి తప్పుకొన్నది.

* * *

మరునాడు అవధానిగారు లెక్కల మాష్టరుగారిని గూర్చి విచారించారు. ఊరు, పేరు, వంశం, గోత్రం, ఆస్తి, చదువు అన్నీ తెలుసు



కొన్న తరువాత వారిని కలుసుకొన్నారు. నిండు హృదయంతో ఆశీర్వదించారు. సంతోషంతో ఇల్లు చేరుకొన్నారు.

బూజులు దులిపారు, పెళ్లలు వేస్తున్నారు. కుండతో నీరు సున్నం పైకెత్తి పట్టుకొన్నాడు రాముడు. చాకలి కేలికుంచె జోరుగా పని చేస్తోంది. అప్పడాలకర్ర చేత్తో పట్టుకొన్న శారద 'అమ్మా అప్పడాలుగుండ్రంగానూ, ముద్దలు గోళాల గానూ ఎందుకు చేస్తున్నావమ్మా?' అన్నది. 'లెక్కల మేస్టారి నడుగుదాం ఇందులో ఏ గణిత రహస్యం దాక్కుందో!' సమాధాన మిచ్చింది తల్లి చిరునవ్వుతో.

వివాహం వైభవంగా జరిగింది. 'మొత్తానికి మా తమ్ముని కియ్యకుండా మీఋణమే చెల్లించు కొన్నారు.' అని వెళ్ళగక్కింది లక్ష్మమ్మ. 'చదువు మాన్పించి నీ ఋణమూ చెల్లించాగా'

'లేదు నాన్నా చదువు మొదలెట్టేను.'

జాజి మొగ్గలలాంటి శారద పలువరసను దానిమ్మ పూరెక్కలాంటి పెదవులు వెంటనే మూసివేసినై.

'ఇంకేం ఆయనేమో వాగులో లెక్కలు చెబుతారు. మీ నాన్నగారేమో అప్పడాల ముద్దల్లో రహస్యాన్ని చవిచూస్తారు. నీవేమో పొట్టుతీయని మినప కుడుములం పెడుదువుగాని' ఫక్కున నవ్వింది లక్ష్మమ్మ బరువు హృదయం తేలిక చేసుకొంటూ.

సంధ్యవేళ ఏతం త్రొక్కిన పడుచు వయిటు సరిజేసుకొని వాగులో నీళ్ళు త్రాగుతోంది. చల్ల గాలి మెల్లిమెల్లిగా జామ తోటల్లోకి జొరబడు తోంది. వాగు ప్రక్కని కొండక్రిందుగా సూర్య భగవాను డదృశ్యుడౌతున్నాడు. తంతితీగెలు రాగాలు తీస్తున్నై. భర్తతో సహా శారద వంతెన దిమ్మమీద కూర్చున్నది. టెంకాయ పాలవంటి వాగునీటిలోకి వంగిచూచింది. తాను తన ప్రియుడు అక్కడ ఊయలలూగుతున్నారు శారద భర్త వక్షంపై వ్రాలిపోయింది. పక్షులు వారి మీదుగా బారులు తీరి గూళ్ళకు చేరు తున్నయ్. పొలంపని ముగించుకుని ఇంటికిపోయే రాముడు ఒక్క నిముషమాగి 'శారదమ్మ...' అని నాలిక కొరుక్కున్నాడు.

# కళాక్షేత్రం

## వి. దుర్గాకుమారి

కవి చేతిలోని కలం ఎందుకో అడ్డులేకుండా సాగిపోవటం లేదు. మెదడెందుకో మొద్దు బారిపోయింది. మునుపటిలాగా మహోత్కృష్టమైన తీయనిభావాలు మెరపుల్లాగా తట్టటం లేదు. కవి ఆశ్చర్యం చెందాడు. ఏమిటీ వింత... నేడు అందరిలో 'ఉత్తమకవి' అని పేరుగాంచిన వాడిలా స్తబ్ధుడయ్యాడంటే కారణం? ఏమీ తోచక అలాగే ఆ పుస్తకాలమధ్య కూర్చుని అందమైన సంధ్యాకాలపు ప్రకృతిని తిలకించే కోరికతో తలపైకెత్తాడు. అంతకుముందే వర్షం వచ్చి వెలుపు పట్టటాన చక్కని యింద్రధనుస్సు ఆకాశంమీద రంగులీనుతూ వింత అందాలు ఒలకపోస్తోంది. అలా చూడటంలో కవి తన్మయుడయ్యాడు. ఇంతలో ఆదేదో దివ్యజ్యోతి... మెల్లగా ఆ యింద్రచాపములోంచి క్రిందికి దిగుతోంది. అతనికి అదేమిటో కనిపించటంలేదు. కళ్ళు మిఱుమిట్లు గొల్పుతున్నాయి. ఆ కాంతి భరించలేక కళ్ళు మూసుకున్నాడు...ఒకలిప్త మాత్రం అలా గడిచింది.

'కవీ'—గద్గదస్వరం విని త్రుళ్ళిపడి కళ్లు తెరిచాడు. ఆహా! ఎవ్వరీ స్త్రీ మూర్తి! తానుపాసించబూనిన దుర్గాదేవి కాదుగదా. తనను పరీక్షించటానికి వచ్చిందేమో. అయితే యీ కన్నీరెందుకు? కాకపోతే దోవతప్పిన బాటసారేమో. అయితే యీ దివ్యకాంతు లెక్కడివి? తృటిలో తన కట్టెదుట ఎలా ప్రత్యక్షమైంది! ఇంతకీ తన పేరెలా తెలిసిందో... ఎవరైతే ఏం తననే సంబోధిస్తోంది.

'ఎవరు తల్లీ నీవు'......

చులకన చేయబడుతున్న కళామూర్తిని—'

'ఆ! కళాధిదేవతవా?-ఆహా నన్ను ఉద్ధరించడానికి వచ్చావా దేవీ. ఈ విశాల విశ్వమంతా నీ కనుబొమ్మల వంపులో యిమిడివుందమ్మా. కోపంతో ఒక్కసారి బొమముడి వేశావంటే